## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక | సామాన్యుడి నేస్తం



బాలాజీ మిల్క్ ఏజెన్సీ
చేర్యాల
మా వద్ద వివాహాది శుభకార్యాలకు పాలు, పెరుగు బకెట్లు, పన్నీర్, ఐస్ క్రీం మొ.నవి ఆర్డర్ పై సప్లై చేయబడును.
NSR పాలు, పాల పదార్థాలు
CONT: 9666464085



ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 82 గురువారం జూలై 23 2026, పేజీలు - 4 వెల :2/-


## ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

-ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ.. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం
-ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
-ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
-ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా



హిందుస్థాన్ మీడియా

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి

-ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
-ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
-యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ



హిందుస్థాన్ మీడియా

నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

## సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ బహిరంగ లేఖ

సీసీఐపై వైఖరి చెప్పండి: సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ
ఆదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణపై వైఖరి చెప్పాలని డిమాండ్
రాష్ట్రం రూ.250 కోట్లు ఇస్తేనే పరిశీలిస్తామన్న కేంద్ర మంత్రి
ఎన్నికల హామీని కాంగ్రెస్ విస్మరించిందని కేటీఆర్ విమర్శ




హిందుస్థాన్ మీడియా

ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్లాంట్ పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం తన అధికారిక వైఖరిని తక్షణమే స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక భవిష్యత్తుకు, వేలాది కుటుంబాల ఉపాధికి కీలకమైన ఈ ప్లాంట్‌ను పునఃప్రారంభించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని ఆయన ఆరోపించారు. ఇటీవల జులై 15న బీఆర్ఎస్ ప్రతినిధి బృందం, సీసీఐ సాధన సమితి సభ్యులతో కలిసి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో గుర్తుచేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ. 250 కోట్లు కేటాయించి, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తేనే ఇది సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రతిపాదన లేకపోవడమే పునరుద్ధరణకు ప్రధాన అడ్డంకిగా మారిందని ఆయన తెలిపారు.ఎన్నికల సమయంలో ఆదిలాబాద్‌లో సీసీఐని తెరిపిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కేటీఆర్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సహా తాను కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. టీఎస్-ఐపాస్ ద్వారా ప్రోత్సాహకాలు, కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్ లేదా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే ప్లాంట్‌ను నడిపేందుకు సిద్ధమని ప్రతిపాదించినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో, సీసీఐ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి, తన వైఖరిని ప్రజలకు వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## భూకబ్జా కేసులో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు హైకోర్టులో ఎదురుదెబ్బ

-తమ్మినేని కుటుంబానికి హైకోర్టులో దక్కని ఊరట.. అరెస్ట్ నుంచి రక్షణకు నిరాకరణ
-తమపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టేయాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన న్యాయస్థానం
-అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించేందుకు నిరాకరణ
-విచారణ ప్రాథమిక దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన కోర్టు
-హైకోర్టు తీర్పు నేపథ్యంలో తమ్మినేని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం



హిందుస్థాన్ మీడియా

శ్రీకాకుళంలో సంచలనం సృష్టించిన భూకబ్జా కేసులో మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ నేత తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని (క్వాష్) కోరుతూ తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణి, కుమారుడు చిరంజీవి నాగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. వారిని అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ వై. లక్ష్మణరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, ఇలాంటి సమయంలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. అరెస్ట్ భయం ఉంటే ముందస్తు బెయిల్ (యాంటిసిపేటరీ బెయిల్) కోసం పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పిటిషనర్లకు సూచించింది. కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను జూలై 29కి వాయిదా వేసింది శ్రీకాకుళం పట్టణం, చాపరం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ.4 కోట్ల విలువైన 900 గజాల స్థలాన్ని కబ్జా చేశారని తమ్మినేని కుటుంబంపై ఆరోపణలు ఉన్నాయి. బతికున్న యజమాని చనిపోయినట్లు నకిలీ మరణ ధృవీకరణ పత్రం సృష్టించి, దొంగ పత్రాలతో ఆ స్థలాన్ని తమ్మినేని కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారని కట్టా జయకిషోర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు మొత్తం 13 మందిని నిందితులుగా చేర్చగా, ఇప్పటికే 8 మందిని అరెస్ట్ చేశారు. హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యులు ఆమదాలవలసలోని తమ నివాసం నుంచి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు వార్తలు వస్తున్నాయి. వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

## అత్యవసర చర్యలు చేపట్టిన అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు

-నైజీరియాలో కలరా విజృంభణ.. బొర్నో రాష్ట్రంలో 200 మంది మృతి!
-గడిచిన రెండు నెలల్లో తీవ్రస్థాయికి చేరిన కలరా మహమ్మారి
-35,500కి పైగా కలరా అనుమానిత కేసులు
-సురక్షిత తాగునీరు, పారిశుధ్యం లేకపోవడమే కారణమన్న ఎంఎస్ఎఫ్
-డ్యామ్‌లు, రిజర్వాయర్లపై ప్రభుత్వం ఆంక్షలు
-ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

హిందుస్థాన్ మీడియా



నైజీరియాలోని ఈశాన్య రాష్ట్రమైన బొర్నోలో కలరా మహమ్మారి తీవ్రరూపం దాల్చింది. గత రెండు నెలల వ్యవధిలోనే ఈ వ్యాధి బారిన పడి దాదాపు 200 మంది ప్రాణాలు కోల్పోయారని అంతర్జాతీయ వైద్య సేవా సంస్థ 'డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్' (ఎంఎస్ఎఫ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. స్థానిక బొర్నో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, జులై 12 నాటికి కనీసం 198 మంది మరణించగా, 35,500 కంటే ఎక్కువ అనుమానిత కేసులు నమోదైనట్లు సంస్థ పేర్కొంది. రోజురోజుకూ కేసులు విపరీతంగా పెరుగుతుండటంతో స్థానిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు బాధితులతో నిండిపోయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని ఎంఎస్ఎఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందిఈ వ్యాధి తీవ్రస్థాయిలో వ్యాపించడానికి ప్రధానంగా బాధితులు నివసిస్తున్న ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీటి వసతి లేకపోవడం, పారిశుధ్య లోపం, అరకొర వైద్య సదుపాయాలు ఉండడమే కారణమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో కురిసిన భారీ వర్షాలు, తదనంతరం సంభవించిన వరదల వల్ల కలరా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని నైజీరియా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ముందస్తుగా 10 రాష్ట్రాలను అప్రమత్తం చేసినప్పటికీ, ప్రస్తుతం బొర్నో ప్రాంతంలో పరిస్థితి చెయ్యిదాటిపోతోంది. ప్రస్తుతం నైజీరియా ప్రభుత్వంతో పాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), యునిసెఫ్,ఎంఎస్ఎఫ్ వంటి అంతర్జాతీయ సంస్థలు సంయుక్తంగా రంగంలోకి దిగి బాధితులకు ఉచిత వైద్య సహాయం అందిస్తున్నాయి.స్థానిక ప్రభుత్వం తక్షణ అత్యవసర చర్యలను అమలులోకి తెచ్చింది. కలుషితం అయ్యే అవకాశం ఉన్న స్థానిక డ్యామ్‌లు, జలాశయాల నీటి వినియోగం పై ఆంక్షలు విధించింది. వీటికి ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తోంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా సోకే ఈ తీవ్రమైన విరేచన వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం అందించకపోతే కొన్ని గంటల్లోనే ప్రాణాంతకం గా మారుతుందని, పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచకపోతే ఈ వ్యాధిని అదుపు చేయడం పెద్ద సవాలుగా మారుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తడ్కపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

-ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి: సర్పంచ్ వెంకటేష్



హిందుస్థాన్ మీడియా:

అర్బన్ మండల పరిధిలోని తడ్కపల్లి గ్రామంలో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, సురభి హాస్పిటల్ డా. శివ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ, ఆసుపత్రులకు వెళ్లలేని సామాన్య ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహిస్తూ, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందాలని సూచించారు. ఆధునిక జీవనశైలి కారణంగా మానసిక ఒత్తిడి పెరుగుతోందని, షుగర్, బీపీ, జ్వరం, దగ్గు, దమ్ము, కాళ్ల నొప్పులు, ఆర్థోపెడిక్ సమస్యలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్లు సూచించారు. శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, బాల వికాస్ సంస్థ కోఆర్డినేటర్లు లక్ష్మి, సరిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల కేజీబీవీలో రెండు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హిందుస్థాన్ మీడియా, చేర్యాల:

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ), చేర్యాలలో సహాయక వంటమనిషి (అసిస్టెంట్ కుక్) ఒకటి, వెట్ స్వీపర్ ఒకటి చొప్పున మొత్తం రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని మండల విద్యాధికారి నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. చేర్యాల మండలానికి చెందిన ఆసక్తి, అర్హత కలిగిన మహిళలు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.9,750 వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను జూలై 23 నుంచి జూలై 25, 2026 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు స్థానిక కేజీబీవీ పాఠశాలలోని స్పెషల్ ఆఫీసర్ కు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు వ్యక్తిగత దరఖాస్తు ఫారం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, 10వ తరగతి మార్కుల మెమో జిరాక్స్ తప్పనిసరిగా జతచేయాలని మండల విద్యాధికారి నరేందర్ తెలిపారు. అర్హత కలిగిన మహిళలు గడువు తేదీలోపు దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ఢిల్లీలో విద్యార్థుల నిరసనకు మద్దతుగా చేర్యాల కాంగ్రెస్ నాయకులు

-రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్షలో పాల్గొన్న నేతలు

హిందుస్థాన్ మీడియా, న్యూఢిల్లీ/చేర్యాల:



నీట్ పరీక్షా పేపర్ లీక్ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ, వారికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా, దౌర్జన్యంగా అదుపులోకి తీసుకోవడాన్ని ఖండిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన దీక్షలో చేర్యాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలపడం ప్రజాస్వామ్య హక్కు అని, అలాంటి నిరసనకు వెళ్లిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో చేర్యాలకు చెందిన కొమ్ము నర్సింగా రావు, మహమ్మద్ ఖాజా, అంబాల రాము, చెవిటి లింగం, నీలం సన్నీ, శెనిగారి భిక్షపతి, తుమ్మ కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### NEET పేపర్ లీక్‌పై పార్లమెంట్ ముందు విపక్షాల ఆందోళన

-విద్యార్థులపై పోలీసుల దాడి నిరసిస్తూ వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య నిరసన

-ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి:వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

హిందుస్థాన్ మీడియా,



NEET పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు. ఈ సందర్భంగా నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ..."విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలను సహించబోము అన్నారు. పేపర్ లీక్‌లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది" అని పేర్కొన్నారు. చీజుజు పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, బయట తమ పోరాటం కొనసాగుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# నీట్ పరీక్ష పత్రాల లీక్‌పై కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన

హిందుస్థాన్ మీడియా, చిన్నకోడూర్:

నీట్ పరీక్ష పత్రాల లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం చిన్నకోడూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చిత్రపటాలను ఊరేగించి దగ్ధం చేశారు. ఎఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు మీసం మహేందర్ యాదవ్, దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన నీట్ పరీక్షా పత్రాల లీక్ ఘటనపై ప్రశ్నించిన విద్యార్థులపై పోలీసులు దాడులు చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ఢిల్లీలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యను ఖండించారు. దేశ రాజధానిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై విచక్షణాం హితంగా లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని విపక్ష నేతలు, విద్యార్థుల గొంతును అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. నీట్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్



పొన్నాల రాజేష్, మండల అధ్యక్షుడు మంద శ్రీకాంత్, అల్లీపూర్ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు హరీబాబు, జయంత్, యాదగిరి, అంతగిరి చంద్రశేఖర్, ఉడుత జయంత్, బత్తిని గణేష్, గొట్టిపర్తి చందు, పరశురాం, చిక్కుడు అనిల్, కాల్వ జగన్, అజయ్, ముత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓ వైపు బారికేడ్... మరోవైపు ఫ్లెక్సీ..!

-భద్రతా ప్రయాణం ఎలా..? చేర్యాలలో అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం

చేర్యాల (హిందుస్థాన్ మీడియా):

చేర్యాల పట్టణంలో వరుస రోడ్డు ప్రమాదాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదాలను నివారించేందుకు అధికారులు కొన్ని ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ, అదే ప్రాంతంలో రహదారిపైకి చొచ్చుకొచ్చేలా భారీ ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీ కారణంగా వాహనదారుల దృష్టి మరలడమే కాకుండా, రోడ్డు విస్తీర్ణం కూడా తగ్గిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు బారికేడ్లతో రహదారి కుదించబడితే, మరోవైపు ఫ్లెక్సీలు కూడా రోడ్డు వైపుకు రావడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని రాజకీయ ప్రభావాల కారణంగా 100 అడుగుల వెడల్పు ఉండాల్సిన రహదారి 90 అడుగులకు కుదించబడిందనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అసంపూర్తిగా వదిలిన పనులు, సరైన భద్రతా చర్యల లోపం కారణంగా చేర్యాలలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు, పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా స్పందించి ఫ్లెక్సీలను తొలగిస్తున్నారని, కొద్ది రోజులకే మళ్లీ యథాతథంగా వాటిని ఏర్పాటు చేయడం పరిపాటిగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇది సమస్య పరిష్కారం కాదని, తాత్కాలిక చర్యలతో ప్రజల ప్రాణ భద్రతను విస్మరించరాదని వారు అంటున్నారు. ప్రజల ప్రాణాలు ముఖ్యమా... లేక రోడ్లపై అడ్డంగా నిలిచే




ఫ్లెక్సీలే ముఖ్యమా? అనే ప్రశ్న ఇప్పుడు చేర్యాల వాసుల నుంచి వినిపిస్తోంది. "ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు... ప్రమాదం జరగ కుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే పరిపాలనకు అసలైన పరీక్ష" అని స్థానికులు అధికారులకు సూచిస్తున్నారు.

# ఏకీకృత టెండర్ విధానం రద్దు చేయాలి..యధావిధిగా టెస్కోకే ఆర్డర్లు ఇవ్వాలి!

-ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రి కొండా సురేఖ సూచనలతో వరంగల్ చేనేత కార్పెట్ బహూకరిస్తూ వినతి పత్రం అందిస్తున్న చిప్ప వెంకటేశ్వర్లు నేత.

హిందుస్థాన్ మీడియా,

వరంగల్ జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,23వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్ట్ కార్పొరేటర్,మహాత్మ జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు గ్రహీత చిప్ప వెంకటేశ్వర్లు నేత ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు.స్థానిక మంత్రి కొండా సురేఖ సూచనల మేరకు ఉప ముఖ్యమంత్రికి ప్రసిద్ధ వరంగల్ చేనేత కార్పెట్ బహూకరించి,చేనేత కార్మికుల సమస్యలపై ప్రత్యేక వినతిపత్రాన్ని సమర్పించారు.ప్రభుత్వ సంక్షేమ శాఖలకు అవసరమైన బెడ్డింగ్ మెటీరియల్ (కార్పెట్లు మరియు బెడ్ షీట్లు)కొనుగోలును ఏకీకృత టెండర్ విధానం నుండి వెంటనే తొలగించి,గతంలో మాదిరిగానే యధావిధిగా టెస్కో(ంజుూజూ)సంస్థకే ఆర్డర్లు ఇప్పించాలని ఈ సందర్భంగా వేడుకున్నారు.టెస్కో ద్వారా కొనుగోలు చేసే చేనేత ఉత్పత్తులపై 30% కూలీ రేట్లు పెంచినందుకు చేనేత సహకార సంఘాల పక్షాన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కార్మికుల ఆవేదన ఽ నేపథ్యం:ఉమ్మడి వరంగల్,కరీంనగర్ జిల్లాల్లో సుమారు 10,000 చేనేత కుటుంబాలలోని దాదాపు 50,000 మంది కార్మికులు బెడ్షీట్లు,కార్పెట్ల ఉత్పత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు.గత 40 ఏళ్లుగా టెస్కో సహకార సంఘాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు నాణ్యమైన ఉత్పత్తులు సరఫరా అవుతున్నాయి.అయితే ఇటీవల ప్రభుత్వం 22 రకాల వస్తువులకు ఏకీకృత టెండర్ విధానం ప్రవేశపె ట్టింది.ఇందులో 20 రకాల వస్తువులు చేతివృత్తులకు సంబంధించనివి కాగా,కార్పెట్లు ఽ బెడ్షీట్లు పూర్తి చేతివృత్తి ఆధారితమైనవి.ఈ టెండర్ విధానం వల్ల చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి,జిల్లాలో చేనేత పరిశ్రమ కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు.ఈ సమస్యపై ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం,స్థానిక మంత్రి కొండా సురేఖ,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్,జిల్లా కలెక్టర్,చేనేత శాఖ కమీషనర్ మరియు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు.ఆర్డర్లు రాక తప్పనిసరి పరిస్థితుల్లో తేది:01-06-2026 నుండి మగ్గాలు బంద్



చేసి,06-06-2026 నుండి 13-06-2026 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు.ఆ సమయంలో స్థానిక మంత్రి కొండా సురేఖ,చేనేత జౌళి శాఖ,టెస్కో అధికారులు దీక్షా శిబిరానికి వచ్చి హామీ ఇవ్వడంతో దీక్ష విరమించామని,ప్రస్తుతం నిల్వ ఉన్న సరుకును టెస్కో ద్వారా కొనుగోలు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ప్రభుత్వానికి ప్రధాన విజ్ఞప్తులు:కార్పెట్లు,బెడ్షీట్లను ఏకీకృత టెండర్ నుండి తొలగించి,నిరంతర ఉపాధికి టెస్కో ద్వారానే ఆర్డర్లు ఇవ్వాలి.చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు పూర్తిగా మాఫీ చేయాలి.విజ్ఞప్తి చేసిన వారిలో:శత్రంజీ & చేనేత ఔ.కో-ఆప్ P&S.S.Ltd.(కొత్తవాడ,వరంగల్),వెంకటేశ్వర చేనేత ఔ. Co-op P&S.S. Ltd.(ఎల్బీ నగర్,కొత్తవాడ)ప్రతినిధులు మరియు చేనేత నాయకులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హిందుస్థాన్ మీడియా,

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా గిర్‌రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిజామాబాద్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సోమనాథం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మంచి స్నేహాలను ఎంచుకుని విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్-ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, కఠిన అమలు చర్యలను సమర్థవ ంతంగా కొనసాగిస్తోందని తెలిపారు. కేవలం సరదాగా మాదకద్రవ్యాలను ఒకసారి వినియోగించినా అది వ్యసనానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే ఐదు నుంచి ఏడు సంవత్సరాలను విద్య, నైపుణ్యాభివృద్ధికి అంకితం చేసి, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని, సానుకూల స్నేహ వాతావరణాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం ఆరోగ్యం, విద్య, ఉపాధి, కుటుంబ జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీ స్తుందని పేర్కొన్నారు.



కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి రాయ బారులుగా మారాలని పిలుపునిచ్చారు. తోటి వారి ఒత్తిడికి లొంగ కుండా కుటుంబ సభ్యులు, సమాజంలో అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రతీ ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. డ్రగ్-ఫ్రీ తెలంగాణ సాధనలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని కోరారు. ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్, సీబీసీ శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటి వల్ల ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలు, ఆరోగ్య సమస్యలపై యువతలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. "డ్రగ్స్‌కు నో... జీవితానికి యెస్" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి ఆచరణలో పెట్టి నషా ముక్త్ భారత్ అభియాన్ విజయ వంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్ మాఫియా ప్రధానంగా యువతనే లక్ష్యంగా చేసుకుం టుందని, అందువల్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకురాలు నహీదా బేగం, అధ్యాపకులు, ఆకాశవాణి ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ మోహన్ దాస్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఆరు వారాల గరిష్ఠానికి ముడి చమురు.. 95 డాలర్లు దాటిన బ్రెంట్ క్రూడ్




-అంతర్జాతీయ ఉద్రిక్తతలు, సరఫరా ఆందోళనలే కారణం
-ద్రవ్యోల్బణం, రవాణా ఖర్చులపై ప్రభావం చూపే అవకాశం
-ఒపెక్ం దేశాల నిర్ణయాలపై ఆధారపడనున్న మార్కెట్ గమనం

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గత ఆరు వారాల్లో తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును అధిగమించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా సంబంధిత ఆందోళనలు, మారుతున్న డిమాండ్ పరిస్థితులే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిణామాలు, ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తిలో సర్దుబాట్లు చేయడం వంటివి ధరల పెరుగుదలకు దారితీశాయి. ఇది చమురు మార్కెట్లలో మళ్లీ అస్థిరతను సూచిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇరాన్ మిలిటరీ స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగిస్తుండటంతో, ప్రతిగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడుతోంది. దీనికి తోడు యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు సౌదీకి సంబంధించిన నౌకలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించడంతో, ఆయిల్ ట్యాంకర్లు తమ రవాణా మార్గాలను మార్చుకుంటున్నాయి. ముడి చమురు ధరల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, రవాణా ఖర్చులపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇంధనం దిగుమతులపై ఆధారపడిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఇది సవాలుగా మారనుంది. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు ప్రభుత్వాలు, పారిశ్రామిక వర్గాలు మార్కెట్ కదలికలను నిశితంగా గమనిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఒపెక్ం దేశాలు తీసుకోబోయే నిర్ణయాలు, అంతర్జాతీయ ఆర్థిక సంకేతాలపై చమురు ధరల గమనం ఆధారపడి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# పాక్ క్రికెటర్లకు కొత్త రూల్.. ఇకపై 'పాడెల్' ఆడాల్సిందే!

## క్రీడలు



-పాక్ క్రికెటర్లకు 'పాడెల్' క్రీడను శిక్షణలో తప్పనిసరి చేసిన పీసీబీ
-ఫిట్‌నెస్, చురుకుదనం, ఫీల్డింగ్ మెరుగుపరచడమే లక్ష్యమని వెల్లడి
-లాహోర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు
-రోజు విడిచి రోజు 40 నిమిషాలు ఈ గేమ్ ఆడాలని ఆదేశాలు
-అకాడమీలో బాస్కెట్‌బాల్ కోర్టులు, ఇండోర్ గేమ్స్ కూడా ఏర్పాటుకు ప్రణాళిక

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఫీల్డింగ్ ప్రమాణాలను పెంచేందుకు ఓ వినూత్న నిర్ణయం తీసుకుంది. 'పాడెల్' అనే క్రీడను లాహోర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో శిక్షణలో భాగంగా తప్పనిసరి చేసింది. ఈ కొత్త నిబంధన ప్రకారం అకాడమీలో శిక్షణ పొందే క్రికెటర్లు రోజు విడిచి రోజు 40 నిమిషాల పాటు పాడెల్ ఆడాల్సి ఉంటుంది. ఈ క్రీడ ద్వారా ఆటగాళ్లలో చురుకుదనం, రిఫ్లెక్స్‌లు, ఫీల్డింగ్‌కు అవసరమైన కదలికలు మెరుగవుతాయని పీసీబీ భావిస్తోంది. ఈ నిర్ణయంపై పీసీబీ సీనియర్ సెలెక్టర్, హై-పర్ఫార్మెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావెద్ మాట్లాడుతూ.. సుదీర్ఘ శిక్షణా శిబిరాల్లో ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశాడు. "మా ఆటగాళ్లలో చాలామంది ఇప్పటికే పాడెల్ ఆడుతున్నారు. కానీ, వారి నగరాల్లో పరిమిత సంఖ్యలో ఉన్న కోర్టుల కోసం చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అందుకే మేమే ఇప్పుడు ఎన్‌సీఏలో ప్రత్యేకంగా ఒక పాడెల్ కోర్టును నిర్మించాం" అని తెలిపాడు. ఆటగాళ్లు ఇప్పుడు తమ క్రికెట్ శిక్షణతో పాటే ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చని వివరించాడు. టెన్నిస్, స్క్వాష్ క్రీడల అంశాలు కలగలిపి ఉండే పాడెల్, చిన్న కోర్టులో ఆడతారు. అయితే, దీనికి ఎంతో శారీరక శ్రమ, ఓర్పు అవసరం. ఆడటానికి సరదాగా ఉంటూనే, ఫిట్‌నెస్‌కు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకిబ్ జావెద్ అన్నాడు. కేవలం పాడెల్‌కే పరిమితం కాకుండా అకాడమీని మరింత అభివృద్ధి చేసే ప్రణాళికలు ఉన్నాయని తెలిపాడు. ఇందులో భాగంగా ఆటగాళ్ల కోసం బాస్కెట్‌బాల్ కోర్టులు, స్నూకర్ వంటి ఇతర ఇండోర్ గేమ్స్ కోసం ప్రత్యేక హాల్ నిర్మించనున్నట్లు వెల్లడించాడు ఎన్‌సీఏను క్రికెటర్లకు 'రెండో ఇల్లుగా' మార్చడమే తమ లక్ష్యమని, ఇక్కడ వారి ఆట నైపుణ్యాలతో పాటు ఫిట్‌నెస్ స్థాయిలను కూడా మెరుగుపరచుకోవాలని ఆకాంక్షించాడు. అకాడమీని ఆటగాళ్లకు మరింత ఫలవంతంగా మార్చే ప్రణాళికలో భాగంగా, ఇప్పటికే ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బౌలింగ్ మెషీన్‌ను కూడా ఏర్పాటు చేశామని ఆకిబ్ జావెద్ గుర్తుచేశాడు.

## వైభవ్ సూర్యవంశీ లాంటి ప్రతిభ ఉన్న ఆటగాణ్ని చూడలేదు: హర్భజన్

-వైభవ్ ఆటతీరుపై మాజీ స్పిన్ దిగ్గజం ప్రశంసలు
-నిర్భయంగా ఆడుతున్న తీరు అద్భుతమన్న హర్భజన్

ఐపీఎల్ అరంగేట్రానికి ముందు నాటి సంఘటన గుర్తు చేసుకున్న మాజీ స్పిన్నర్ తొలి బంతిని ఎలా ఆడతావంటే.. అనుకూలంగా వస్తే సిక్స్ కొడతానన్నాడని వెల్లడి టీమిండియా యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. 15 ఏళ్ల వయసులోనే ఎలాంటి భయం లేకుండా అతడు ఆడుతున్న తీరు అద్భుతమని కొనియాడాడు. తన కెరీర్‌లో ఇలాంటి ప్రతిభ ఉన్న ఆటగాణ్ని ఎప్పుడూ చూడలేదని చెప్పాడు. యువ ఆటగాళ్లు తమ సహజ శైలిలో ఆడేందుకు ఇప్పుడు భారత క్రికెట్‌లో మంచి వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నాడు. వైభవ్ ఐపీఎల్ అరంగేట్రానికి ముందు జరిగిన ఓ సంఘటనను కూడా హర్భజన్ గుర్తు చేశాడు. తొలి బంతిని ఎలా ఆడతావని కోచ్ రాహుల్ ద్రవిడ్ అడగ్గా, తనకు అనుకూలంగా వస్తే సిక్సర్ కొడతానని వైభవ్ చెప్పాడని, చెప్పినట్టుగానే శార్దూల్ ఠాకూర్ వేసిన తొలి బంతికే సిక్సర్ బాదాడని వెల్లడించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డు సృష్టించాడు. తొలి సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, జింబాబ్వేతో జరగనున్న టీ20 సిరీస్‌కు అతడిని మళ్లీ ఎంపిక చేయడంతో తన ప్రతిభను నిరూపించుకునే మరో అవకాశం లభించింది.



# ది ఈస్ట్ ప్యాలెస్' (నెట్ ఫ్లిక్స్ సిరీస్ రివ్యూ!




కొరియన్ సినిమాలకు .. సిరీస్ లకు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ వైపు నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. కొరియన్ కథల్లోని బలం .. సహజత్వం .. టేకింగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందువలన ఓటీటీ సెంటర్లలో కొరియన్ కంటెంట్ హవా నడుస్తోంది. అలా వచ్చిన సిరీస్ గా 'ది ఈస్ట్ ప్యాలెస్' కనిపిస్తోంది. నామ్ జూ హ్యూక్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ డార్క్ ఫాంటసీ సిరీస్ ను 8 ఎపిసోడ్స్ గా రూపొందించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో తెలుగులోను స్ట్రీమింగ్ అవుతోంది. అది ఒక అందమైన ప్యాలెస్. అక్కడ నుంచే ప్రిన్స్ 'క్రౌన్' తన పరిపాలన కొనసాగిస్తూ ఉంటాడు. అతనికంటే ముందున్న రాజుకి నలుగురు వారసులు ఉంటారు. వాళ్లంతా కూడా ఒకరి తరువాత ఒకరు చనిపోతారు. ఆ మరణాలు జరిగిన 30 ఏళ్ల తరువాత ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతూ ఉంటుంది. క్రౌన్ వారసులు ముగ్గురు చనిపోతారు. నాల్గొవ కుమారుడు (యువరాజు) చావు బ్రతుకుల్లో ఉంటాడు. ఈ వరుస మరణాలకు కారణం 'కోనేటి దెయ్యం' అనే అంతా నమ్ముతుంటారు. 'గు – చోన్' ( నామ్ జూ హ్యూక్)కి చిన్నతనం నుంచే కొన్ని అతీంద్రియ శక్తులు వస్తాయి. అందువలన అతనికి దుష్టశక్తులను ఎదుర్కొనగలిగే శక్తి వస్తుంది. ఈ కారణంగా 'క్రౌన్' అతనిని పిలిపిస్తాడు. కోనేటి దెయ్యాన్ని అంతం చేసి, తన కొడుకుని బ్రతికిస్తే, అతను కోరినది ఇస్తానని చెబుతాడు. అసలు విషయాన్ని దాచేసి, 'వాస్తు నిపుణుడు'గా తన ప్యాలెస్ లో చెలామణి కావలసిందిగా ఆదేశిస్తాడు. ప్యాలెస్ కి దూరంగా పెరిగిన కూతురు (యువరాణి)ని పిలిచి, 'గు –చోన్'కి సహకరిస్తున్నట్టుగా ఉంటూ, అతనిని గమనించమని చెబుతాడు. యువరాణి .. గు – చోన్ ఇద్దరూ కూడా ఆ ప్యాలెస్ లో తిరుగుతూ, పరిస్థితులను పరిశీలించడం మొదలుపెడతారు. ఆ ప్యాలెస్ లో 'కోనేరు' చుట్టూ ఏదో రహస్యం ఉందని భావిస్తారు. అలాగే 'ఉప్పుగని' ప్రదేశంలోనే ప్రేతాత్మల హడావిడి ఎక్కువగా ఉండటాన్ని గమనిస్తారు. మంత్రించిన కుండల వెనుక మర్మం ఏదో ఉందని భావిస్తారు. యువరాజు ప్రాణాలకు హాని తలపెడుతున్న పిశాచిని గురించి కనుక్కోవడానికి 'గు–చోన్' ప్రయత్నిస్తూ ఉంటాడు. ఆ రాజభవనంలో తన తల్లిని హత్యచేసింది ఎవరనే అన్వేషణను యువరాణి కొనసాగిస్తూ ఉంటుంది. ఆ రాజభవనంలోని రహస్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నించిన వాళ్లు ప్రాణాలతో ఉండరనే ఒక ప్రచారం ఆ రాజ్యంలో బలంగా వినిపిస్తూ ఉంటుంది. అందువలన తాను వచ్చిన పనిని పూర్తి చేసి త్వరగా బయటపడాలనే ఉద్దేశంతో 'గు – చోన్' ఉంటాడు. తాను వచ్చిన పని అయ్యేంతవరకూ రాజభవనంలోనే ఉండాలనే ఆలోచనతో యువరాణి ఉంటుంది. వాళ్ల ప్రయత్నాలకు రాజమాత అడ్డుపడుతూ ఉంటుంది. వాళ్ల అన్వేషణలో తేలే నిజాలేమిటి? పిశాచిగా మారిన రాజనర్తకి ఎవరు? ఆ రాజభవనంలోని తూర్పు ప్రదేశంలో దాగిన రహస్యాలేమిటి? అనేది కథ. రాజభవనంలో వరుసగా జరుగుతున్న వారసుల మరణాలు, చనిపోయిన రాజనర్తకి అందుకు కారణమంటూ అసహనాన్ని ప్రదర్శించే రాజమాత, రాజావారి ఆదేశంతో ఆ పిశాచాన్ని అంతం చేయడం కోసం బరిలోకి దిగిన కథానాయకుడు, అతని పనితీరును పరిశీలించడం కోసం నియమితమైన యువరాణి. రాచకుటుంబంతో గల గొడవల కారణంగా ప్యాలెస్ కి దూరంగా పెరిగిన పాత్ర ఇది. ప్రధానమైన కథ అంతా కూడా ఈ నాలుగు ప్రధానమైన పాత్రల చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. ఇక రాజభవనంలో పెత్తనం కోసం పోటీలు పడటం సహజమే. రాజభవనంలో ఏం జరుగుతుందనేది బయటికి తెలియకుండా సేవకులను భయపెట్టడం మామూలే. ఈ నేపథ్యంలో వాళ్ల క్షుద్ర విద్యలను తెలిసినవాళ్లను నమ్మడం కూడా సహజంగానే జరిగిపోతూ ఉంటుంది. ఈ అంశాలన్నిటినీ కలుపుకుంటూ సాగిపోయే ఈ కథ, ఇటు హారర్ టచ్ ను .. అటు ఫాంటసీ టచ్ ను ఇస్తూ .. జానపద కథను తలపిస్తుంది. రాజభవనం చుట్టూ అల్లుకున్న రహస్యాలను ఛేదించడం అనే అంశమే అందరిలో చాలా ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఇక ఆ అంశం క్షుద్ర శక్తులతో ముడిపడి ఉంటే .. అతీంద్రియ శక్తులతో వాటిని ఎదుర్కోవడం వంటి సన్నివేశాలు ఉంటే ఆడియన్స్ మరింత ఎంజాయ్ చేస్తారు. అలా ఈ కంటెంట్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. నైట్ ఎఫెక్టులు .. గ్రాఫిక్స్ .. విజువల్స్ .. సెట్స్ .. ఈ సిరీస్ ను నెక్స్ట్ లెవెల్లో మన కళ్లముందు నిలబెడతాయి. ఒక సాధారణ యువకుడు .. యువరాణి అనే విషయం తెలియక ఆమెతో కలిసి రహస్యాలను ఛేదించడం థ్రిల్ కలిగిస్తుంది. కథలో ట్విస్టులపై ట్విస్టులు ఉంటాయి. ఒకానొక దశలో నాల్గో ఎపిసోడ్ కి కథ అయిపోయిందేమో .. ఆ తరువాత ఇంకా ఏం చూపిస్తారబ్బా అనిపిస్తుంది. కానీ అక్కడి నుంచి కథ మరో అనూహ్యమైన మలుపు తీసుకుంటుంది. ఇలా ఈ కథ అంతఃపురం మొదలు ప్రేతాత్మలతో యుద్ధం వరకూ వెళుతుంది. కథ .. స్క్రీన్ ప్లే చాలా ఆసక్తికరంగా సాగుతాయి. మేకింగ్ చాలా స్టైలీష్ గా అనిపిస్తుంది. ఫొటోగ్రఫీ – నేపథ్యసంగీతం ఎక్కువ మార్కులు సంపాదించుకుంటాయి. ఎడిటింగ్ విషయానికి వస్తే కొన్ని సన్నివేశాలను ట్రిమ్ చేసుకోవచ్చు. గ్రాఫిక్స్ ను గట్టిగానే ఉపయోగించారు. పిశాచాలతో పోరాటం వంటి సన్నివేశాలు కాస్త ఇబ్బంది పెట్టినా, మిగతా సన్నివేశాలు ఆసక్తికరంగానే సాగుతాయి. సాధారణంగా జానపద కథలకు ఫాంటసీ టచ్ ఇవ్వడం జరుగుతూనే ఉంటుంది. ఈ సిరీస్ లో హారర్ టచ్ కూడా ఇవ్వడం కొత్తగా అనిపిస్తుంది.

# రవితేజా కుటుంబం నుంచి మరో హీరో...

## 'మారెమ్మ' రిలీజ్ డేట్ ఫిక్స్

మాస్ మహారాజా రవితేజ కుటుంబం నుంచి మరో యువ నటుడు తెలుగు తెరకు పరిచయం కాబోతున్నాడు. రవితేజ సోదరుడి కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మారెమ్మ'. ఈ సినిమా విడుదల తేదీని చిత్ర బృందం బుధవారం ప్రకటించింది. సెప్టెంబర్ 10న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. మాధవ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు మంచాల నాగరాజ్ తెరకెక్కించిన గ్రామీణ నేపథ్య యాక్షన్ డ్రామా 'మారెమ్మ'. నిర్మాణ సంస్థ 'మోక్ష ఆర్ట్స్' తమ సోషల్ మీడియా వేదికగా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ, "రక్తం, నమ్మకం, త్యాగంతో కూడిన ఒక సాహసోపేతమైన కథ మిమ్మల్ని భావోద్వేగ ప్రయాణంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 10, 2026న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఘనంగా విడుదల కానుంది" అని పేర్కొంది. చిత్ర బృందం విడుదల చేసిన తాజా పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఇందులో మాధవ్ ఉగ్రరూపంలో, పోరాటంలో అలసిపోయినట్లుగా కనిపిస్తున్నారు. నాటకీయత ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్‌లో కథానాయకుడికి, ఒక పవిత్రమైన గోవుకు మధ్య ప్రతీకాత్మకమైన ముఖాముఖిని ఆసక్తికరంగా చూపించారు. 'మారెమ్మ' చిత్రం ద్వారా మంచాల నాగరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'మోక్ష ఆర్ట్స్' బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, పాటలు



సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తనదైన గ్రామీణ కథా శైలితో ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటోందన్న సంకేతాలను ఇచ్చింది. గ్రామీణ నేపథ్యంలో సాగే 'మారెమ్మ', స్థానిక సంప్రదాయాలతో కూడిన భావోద్వేగభరితమైన యాక్షన్ డ్రామాగా రూపొందింది. బలమైన మానవ సంబంధాలను ఈ కథ ఆవిష్కరిస్తుందని చిత్ర బృందం వెల్లడించింది. ఈ సినిమాలో దీపా బాలు కథానాయికగా నటిస్తోంది. సాంకేతిక విభాగంలో ప్రశాంత్ ఆర్. విహారి సంగీతం అందించగా, ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455